కథానిక

# తెలివి - అతి తెలివి

జయంతి శ్రీరామమూర్తి

ఎలమంద చాలా తెలివిగలవాడు. ఎంత తెలివితేటలు లేకపోతే పనిలోచేరిన రెండేళ్ళకే ప్రమోషను పొందగలుగుతాడు? ఇప్పుడతడు నాలుగువందల పనివాళ్ళలో ఒకడుకాడు. మేనేజరు దొరగారికి సాక్షాత్తూ ఆర్డర్లీ. అంతమంది వుండగా తనను ఏరికోరి వారే తమవద్దకు పిలుచుకున్నారు. ఇది ప్రమోషన్ కాదూ? ఎలమంద దొరగారి ఆర్డర్లీ అయినరోజున ఆ ఫ్యాక్టరీలో పెద్ద కలవరం పుట్టింది. తెలుగువాడని చేర తీసేరన్నారు కొందరు. అందులోనూ రాయలసీమవాడన్నారు మరి కొందరు. కుక్కలు మొరుగుతే జంగం పరపతి పోతుందా? దొరగారు తమ ఆర్డరు మార్చుకుంటారా?

"ఎలమంద చాలా తెలివిగలవాడు. అందుకే వాడికి ప్రమోషన్ ఇచ్చేము" అన్నారు.

"అయితే మేమంతా తెలివి తక్కువ దద్దమ్మలమా? వాడికంటే ముందు పనిలో చేరినవాళ్ళం" అన్నాడు కామయ్య. దొరగారు పులిలాగ చూసేరు. అంతే-వాడు పిల్లిలాగ వూరుకున్నాడు. ఎలమంద విజయగర్వం పొందేడు. కాదు మరీ! కాస్తాకూస్తా లాభమా? ఆ నాటినుంచీ బస్తాలకు బుజాలు వప్పచెప్ప నక్కరలేదింక. చక్రాలకు ఆయిలు పూయడమూ, పట్టాలు కలపడమూ-ఇలాంటి ప్రమాదకరమైన పనులదగ్గరకే పోనక్కరలేదు. దర్జాకి దర్జా, సులువుకి సులువు. ఒక్క ఉండేలు దెబ్బకే రెండు పిట్టలు పడ్డాయి!

"ఇప్పుడు పని చాలా సులువు. బహుశా ఒక్కొక్క ప్రమోషనే వస్తున్నకొలదీ పని తేలికవుతూంటుంది కాబోలు!" అనుకున్నాడు ఎలమంద. ఉదయమే లేచి దొరగారి ఆఫీసుగది వూడ్చడమూ, ఆయన కుర్చీ, బల్లా, మూసుకునే ఫైళ్ళూ-పీటన్నిటిమీదా వున్న దుమ్ము దులపడమూ, పెన్సళ్ళూ, కలాలూ, సిరాబుడ్లూ అన్నీ సరిగా సర్దడమూ, పదిగంటలుకాగానే డవాలీ తగిలించుకొని దొరగారు రాగానే సలాంకొట్టడమూ-ఇవీ అతని పనులు. ఆతర్వాత రోజంతా ఆయన కూర్చుని, లోపల గంటమ్రోగినప్పుడల్లా వెళ్ళి ఆయిన ఎవరిని, పిలవమంటే వారిని పిలుచుకు రావడం. అలా పిలవడంలో తన చెవిని ఏవైనా ముఖ్యమైన మాటలు పడితే వాటిని దొరగారి చెవిలోకి వూదడంకూడా ఒక పనిగా తెచ్చుకున్నాడు ఎలమంద.

ఇలా ఒక నెల గడిచేక ఎలమంద తెలివి ఇంకా ఎక్కువయింది. ఇప్పుడతగాణ్ణి ఆఫీసు పనిలోనుంచి దొరగారు ఇంటిపనిలోకి బదలాయించేరు. వుండడానికి దొరగారిబంగళా వెనకవున్న సర్వెంటు క్వార్టర్సులో ఒకగది యిచ్చేరు. దొరగారి ఆఫీసు గది బదులు కారు క్లీనుచెయ్యడమూ, బల్లబదులు జోళ్ళు తుడవడమూ, కలాలూ కాగితాలు సర్దే బదులు మంచాలమీద రగ్గులూ, దుప్పట్లూ సర్దడమూ ఇవి ఉదయపు డ్యూటీలు. ఇవి కాగానే ఇంత రాగిసంగటి చేసుకు జుర్రేస్తాడు. ఇంతలో అమ్మగారు చేతికోక సంచీయిచ్చి బజారుకి పంపుతుంది. బజారంతా తిరిగితిరిగి, బేరమాడి కూరలు ఏ దుకాణంలో కాస్త అగ్గువో అక్కడ కొని తీసుకువెడతాడు. ఒక్కొకనాడు వాటి మొహం మండ, ఎక్కడ చూసినా ధరలు ఆకాశంమీదనే కూర్చుంటాయి. ఆనాడు ఎలమంద అమ్మగారికి అక్కౌంటు చెప్పేటప్పుడు నాలుగణాలు తగ్గించి చెబుతాడు. అలా చెప్పడంలో ఆ నాలుగణాలూ తనచేతి చమురైతే కావచ్చును. కాని దానివల్ల అమ్మగారి మెప్పూ, ఆమెనుంచి అయ్యగారి మెప్పూ లభిస్తుంది!

రోజులు గడుస్తున్నాయి. రాగారాగా ఆ ఫ్యాక్టరీలో పనిచేసే తన పూర్వపుమిత్రులు ఎలమందతో సరిగా మాటలాడడంలేదు. అతన్ని

చూసి బెదిరి దూరదూరంగా వుంటుంటారు. వాళ్ళల్లో వాళ్లు గుసగుస లాడుకుంటుంటారు. "వీళ్ళందరికీ ఆ కామయ్యగాడే పెద్దంట. వీళ్లంతా కలిసి రాత్రిపూట చదువు నేర్చుకుంటున్నారట. ఏం చదువో, ఎందుకొచ్చిన చదువు? నా ప్రమోసను చూసి కళ్ళలో కారం పెట్టుకునే కామయ్యగాడేం చదివితే ఏంలాభం?" అనుకున్నాడు ఎలమంద. కాని ఒక్కొకరోజు గడుస్తున్నకొలదీ మళ్లీ వాళ్లదగ్గరికే వెడదామనీ, వాళ్ళతో కలిసి హాయిగా సినీమాలు చూద్దామనీ అభిలాష అతనిలో ఎక్కువౌతోంది. అలా కలవడానికి ఎలమంద ప్రయత్నించేడు. సాయంత్రం ఒక గంట తీరిక దొరికితే వాళ్ళుండే కాలనీకి వెళ్లేవాడు. కాని వాళ్ళుమాత్రం ఎప్పటిలాగే ప్రక్క ప్రక్కగా తప్పుకుపోయేవారు. అదిచూసి ఎలమంద వొళ్ళు మండింది. కామయ్యగాడికి ఎలాగైనా బుద్ధి చెప్పాలని నిశ్చయించుకున్నాడు. ఆ సంగతి అదే రాత్రి దొరగారితో చూచాయగా అనాలనుకుని, "బాబూ! ఈ కాకిమూక నన్ను గ్రద్దలా చూస్తోందండి" అన్నాడు.

"నీకెందుకురా భయం? నేనుండగా నీపక్షం!" అన్నారు దొరగారు. దానితో మళ్ళీ బేఫర్వాగా కాలం గడుపుతున్నాడు ఎలమంద.

ఒకనాడు ఎలమంద బజారుకుపోయి కూరలు తెస్తుండగా కామయ్య ఎదురయ్యేడు.

"ఏమిటి కామయ్యా ఎక్కడనుంచి?" అన్నాడు ఎలమంద.

"ఎక్కడనుంచైతే నీకెందుకు లే?"

"అదేంటబ్బా! నేనేం పులినా, భూతాన్నా అలా తప్పుకు తిరుగుతున్నావు?" అన్నాడు ఎలమంద.

"ఆ మాటలన్నీ నాకెందుకు లే నా మానాన నన్ను పోనీ."

"పోదుగాని లే. ఈ రోజుల్లో మంచి చెబితే కూడా వినవేమిటి-ఇదేం న్యాయం?" అన్నాడు ఎలమంద.

"మంచో, చెడ్డో ఇలా బతకనిస్తే చాలు" అని విసిరేడు కామయ్య.

"పోన్లేరా కామయ్యా! మీరంతా నన్నేంటో అనుకుంటున్నారు. నిజం నిలకడమీదగాని తేలదు. దానికేంగాని ఈమాట విన్నావా?"... ఎలమంద.

"ఏమాట" అన్నట్టు చూసేడు కామయ్య.

"మన లచ్చుమయ్య పనిచేసే మిల్లులో ఐదేసి రూపాయలు జాస్తీ చేస్తారటగా ఈ మధ్య తెలుసా?"

"తెలుసు."

"అయితే మీరంతా కలిసి అడగకూడదా యిక్కడకూడా?"

"అడగ్గానే ఎవరిస్తారీ రోజుల్లో?"

"అడక్కపోతే అమ్మయినా పెట్టదుగదా. మీనాయాన మీరడిగిచూడండి. అంతగా ఇయ్యకపోతే చేతులోవున్నదేగా ఆయుధం. అది ప్రయోగిస్తే అన్నీ రాలతాయి" అన్నాడు ఎలమంద.

"ఏమిటది స . "

"అదే, అదే, బిగ్గరగా అనబోకు. చెట్లకికూడా చెవులుంటాయి" అంటూ దారితీస్తుండగా, "సరే, మనవాళ్ళనందరినీ అడిగిచూస్తాను. ఈలోగా దొరగారితోమటుకు ఈ సంగతి అనేవు గనక" అన్న కామయ్యకు-

"రామ-రామ. నేనూ మనిషినే కామయ్యా" అంటూ ధీమాచెప్పి వెళ్ళిపోయేడు ఎలమంద.

ఆరాత్రి ఆరుబయట వంటరిగా కూర్చున్న దొరగారిప్రక్క చేతులుకట్టుకు నిలబడి ఎలమంద ఇలాగన్నాడు.

"బాబూ! ఈకబురు విన్నారా?"

"ఏమిటిరా అది?" అన్నారాయన పరధ్యానంగానే.

"అదే బాబయ్యా! మన మిల్లులోవాళ్ళంతా సమ్మెకడతారంటండీ."

మేనేజరు ఉలిక్కిపడి "ఏమిటిరా అన్నావ్? సరిగాచెప్పు. ఎవడన్నాడీమాట. ఎందుకు సమ్మె చేస్తారు?" అన్నాడు.

"ఇందాకా ఆ కామయ్యగాడన్నాడండి. మన ప్రక్కమిల్లుల్లో జీతంలో అయిదురూపాయలు ఎక్కువచేస్తారట. ఈళ్ళకి కూడా అలా గిప్పించమని తమర్ని అడుగుతారంట"...ఎలమంద.

"అడుగుతారు. అడుగుతారు. నేనూ అడుగుతాను. కాని యిచ్చేదెవరు?" అన్నాడు మేనేజరు కోపంగా.

"ఇయ్యకపోతే సమ్మెచేస్తారంటండి"

"సమ్మె చెయ్యమను. చావమను. ఎవడిస్తాడురా పెళ్ళకి ఇంతకంటె? ఈజీతం చాలదంటే పొమ్మను. అందరినీ కట్టకట్టుకు గంగలో దిగమను. మనకేం మనుష్యులు దొరకరా" అన్నాడు మళ్ళీ మేనేజరు ఆవేశంతో. ఎలమంద "ఛిత్తం, చిత్తం ఎందుకు దొరకరండి ఈ రోజుల్లో కూడున్న దెవడికి?" అని తప్పించుకుపోయేడు.

మరునాడు ఆఫీసుకి వచ్చీరావడంతోనే కామయ్యని పిలిపించేరు మేనేజరు అతన్ని చూసీ చూడగానే "ఏమిటోయ్ నీకళ్లు నెత్తిమీది కొచ్చేయుట ఈ మధ్య?" అన్నాడు అధికారి కామయ్య నిర్ఘాంతపోయి నిలుచున్నాడు. మళ్ళీ ఆయనే అందుకని "నీపొళ్లు వాచిందట. మాడబ్బు బాగా వంటపడుతోందట" అన్నాడు.

"అదేదో కాస్త సరిగాచెబుతారా?" అన్నాడు కామయ్య మెత్తగా.

"నువ్వేదో యుద్ధాన్ని నడుపుతున్నావట నామీద"... మేనేజరు.

"మీరుచెప్పేదేమిటో నాకు తెలియటేదండి"

"ఎలా తెలుస్తుంది. పిల్లి పాలుత్రాగుతూ ఎవరూ చూడ్డంలేదనుకుంటుందిలే. నీ తెరవెనక భాగవతాలు నాకు తెలియనివా?"

"తెలిస్తే కాస్త విడమరచి చెబుతారా"

"చెప్పాలి. పెద్దదొరవి గాదూ" అని ఈసడించేడు మేనేజరు.

"దొరనైతే ఇలా గెందుకుంటాను?" అని సణుక్కున్నాడు కామయ్య. దానితో ఆయన ఉగ్రుడై,

"ఎలాగున్నావురా, రాస్కెల్" అంటూ లేచేడు. కామయ్య ఉద్రేకాన్ని అణచుకోలేక, "దయవుంచి కాస్త మాటలు సరిగా రానివ్వండి" అన్నాడు.

"నాకెదురు చెబుతావురా గాడిదా! చూడు డిస్‌మిస్ చేయిస్తాను, గెటవుట్" అంటూ కామయ్యని ఒకగెంటు గెంటేడు మేనేజరు. ఆ త్రోపుతో అతడు తలుపుమీద పడవలసిందే గాని ఎలాగో తట్టుకుని బయటకు వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు ఫ్యాక్టరీలో పనికి ఎవ్వరూ రాలేదు. కామయ్యని అవమానించినందుకు మేనేజరు క్షమాపణ చెప్పాలని పోస్టర్లు పుచ్చుకు బయటకూర్చున్నారు కార్మికులు. లోపల మేనేజరూ, ఎలమందా మాత్రం వున్నారు. ఆయన ఫోనుచేస్తే పోలీసులు వచ్చేరుగాని, కార్మికులు శాంతియుతంగా ప్రవర్తించడంవల్ల వాళ్ళేమీ కలగజేసుకోలేదు. మొదట్లో లెక్క చెయ్యనని భీష్మించిన మేనేజరుని ఆ సాయంత్రమే భయమావరించింది. ప్రజాశక్తి యెదుట నిలచినతాను సముద్రాన్ని ఆపబోయిన కట్టెముక్కలా వున్నాననుకున్నాడు. మరునాటికా వార్త పేపర్లలో ఎక్కి కోతిపుండు బ్రహ్మరాక్షసిలా తయారయింది. కంపెనీకి విశేషనష్టం వస్తూంది. ఆయనలోని మొండిధైర్యం సడలిపోయింది. ఆ సాయంత్రమే దూరానవున్న ప్రొప్రయిటరువద్దనుంచి తంతి వచ్చింది. దాన్లో ఏముందోగాని ఆరాత్రి కామయ్యని తనయింటికిఆహ్వానించేడు మేనేజరు. నలుగురు మిత్రులతో కలిసి కామయ్య వచ్చేడు. మేనేజరు వాళ్ళందరికీ టీ యిచ్చి కామయ్యతో చేతులు కలిపి "క్షమించు తొందరపడ్డాను." అన్నాడు. కామయ్య గుండెకరిగి "తమదేం తప్పులేదు. ఆవేళా విశేషం అటువంటిది. అయిందేదో అయిపోయింది రేపటినుంచి పనిలోకి వస్తామ"ని వాగ్దానంచేసి మిత్రులతో వెళ్ళిపోయేడు.

వాళ్ళు వెళ్ళిపోయిన చాలా సేపటిదాకా కామయ్య నమ్రవాక్కులు మేనేజరు చెవులలో గింగురుమంటూనే వున్నాయి. ఒంటరిగా కూర్చున్న ఆయనలో పశ్చాత్తాపమూ, సిగ్గూ పెనవేసుకుంటున్నాయి. గడచిపోయిన తుఫానుకు పూర్వాపరాలు యోచిస్తూన్న భర్తను సమీపించి "అసలీ రాద్ధాంతమంతా ఎందుకు తెచ్చిపెట్టుకున్నారు?" అంది భార్య.

"అదుగో! ఆ ద్రేపి మొహం మూలాన" అన్నాడాయన దూరాన జోళ్లు పాలిష్ చేస్తున్న ఎలమందను చూపిస్తూ.

మరునాడే ఉద్యోగంనుంచి బర్తరఫ్ చేయబడ్డట్టు చీటీ అందింది ఎలమందకు. ఫ్యాక్టరీ పనిచేత కానందున ఆర్డర్లీ పని యిచ్చినట్లూ, ఇప్పుడు అదీ సరిగా చెయ్యనందున డిశ్చార్జి చేసినటూ రాసేరు మేనేజరు. ఆ కాగితం చేత ...

కుని దీర్ఘంగా నిట్టూర్చేడు ఎలమంద. తన పెట్టీ బెడ్డింగూ పుచ్చుకుని వీధిలోకి వచ్చేసేడు. దొరగారుగాని, ఆయన భార్యగాని కిమ్మనలేదు. రోడ్డు ఎక్కగానే అడుగు ఎటువైపు వెయ్యాలో బోధపడలేదు ఎలమందకు.

పాత స్నేహితులవద్దకే వెడదామంటే ఏ మొహంపెట్టుకు వెళ్ళేది? ఆఖరున జరిగిన వ్యవహారపులో గుట్టు కామయ్యకు తెలియదా? వాడీ పాటికి చాటించివుండడా? ఏమీ పాలుపోలేదు. వెర్రిమొహంపెట్టుకుని వీధిచివరమైదానంలో కూలబడ్డాడు ఎలమంద.

“ఏంచెయ్యాలి? ఎక్కడికిపోవాలి?” అన్న విషయాన్ని గురించి ఒకగంట ఆలోచించేడు. ఏమీ తట్టలేదు. ఇంతలో కామయ్య వెనుకనుండి వచ్చి, “లే, ఎలమందా”అన్నాడు. ఎలమందలో ఆశ్చర్యమూ, సిగ్గూ పెనవేసుకుని మాట పైకిరానివ్వలేదు.

“నాకంతా తెలిసిందిలే. నీకేం ఫరవాలేదు. నాబసకి రా”అంటూ బెడ్డింగు తీసుకున్నాడు కామయ్య. విధిలేక ఎలమంద పెట్టెతీసుకుని అనుసరించేడు.

ఆ సాయంత్రం కామయ్య తిరిగితిరిగి ప్రతీ కార్మికునివద్దా నాలుగణాలచొప్పున చందా వసూలుచేసి ఎలమందతో ఇలా అన్నాడు: “ఈ వందరూపాయలూ వాడుకో మళ్ళీ నౌకిరీ వచ్చేదాకా. బెంగపెట్టుకోకు. మా ప్రాణంలాంటి ప్రాణమే నీదీను.” ఎలమంద ఆ మాటలు విని గతించిన తన ప్రవర్తన తలుచుకుని కుమిలిపోయాడు. సంఘబలమంటే అప్పుడు బోధపడింది. అతితెలివికీ, తెలివికీగల భేదం స్ఫురించింది.

---

కథానిక

# పెద్దమనుషులు

చౌదుల వెంకటరత్నం

ఆ వూళ్ళో వెంకట్రామయ్యగారంటే అదోవిధమైన మోజు. ఆమోజును పురస్కరించుకొని వచ్చే ఎన్నికల్లో ప్రెసిడెంటుకైనా పోటీచేస్తానంటాడాయన. కొంతపోగా మిగిలిన కాస్త గౌరవానికిగల కారణం, గతంలో ఆయన నిర్వహించిన రెండు పదవులూను. మునసబు, పంచాయతీబోర్డు ప్రెసిడెంటు రెంటినీ కొన్నాళ్లపాటు నిరాటంకంగా నిర్వహించారు. ప్రపంచ పరిస్థితులతోపాటు ఆయన పరిస్థితీ దిగజారిపోయింది. జరిగిన ఎన్నికల్లో వ్యతిరేకవర్గం ఆయనపై గట్టి దెబ్బతీసింది. పేరుమోగిన భూస్వామి పట్టియ్యగారు ప్రెసిడెంటుగా ఎన్నికయారు. ఈయనతోబాటు ఈయన వర్గంలోని సభ్యులే ప్రతివార్డులోను ఎన్నికయ్యారు. మునసబుగిరీకూడా ఇంకో వెంకన్నకు పదవీదానంచేసేశారు వెంకట్రామయ్యగారు. ఎంత అపజయం ఆవహించినా ఆయన ధైర్యంమాత్రం విడవలేదు. పదవిలేకుండా ప్రజాసేవచేయడం కష్టమనుకునేవారిల్లో ప్రథముడు కాబట్టి పట్టుదలగా సమయంకోసం నిరీక్షిస్తున్నారు. ఆస్తి కాస్తా హారతి కర్పూరంలా ఆరిపోయింది. మిగిలిందల్లా బీటలువారిన మేడ ఒక్కటే. ఈస్థితిలోవున్న మేడను ఏ పోస్టాఫీసుకో అద్దెకివ్వడం మంచిదనే తలంపు ఈ మధ్యే కలిగింది వెంకట్రామయ్యగారికి. పదవిలేకపోయినా కచేరీకొచ్చి చాణక్యుని ప్రజ్ఞ వెళ్ళగక్కుతూ వుంటారు తరచు. ఇహ తన జీవితలక్ష్యం ఒకటే ఒక్కటి. అది- పోయిన గౌరవం, ప్రతిష్ఠ పునః ప్రతిష్ఠించుకోవడం.

ఒకసారి రైతులపై గండిసేరం మోపాడు ఓవర్సీరుగారు. కేసు పెడతాను పెడతానని బెదరించి రైతుల్లో ఏమాత్రం ఆదురూ బెదురూ కనిపించకపోతే ప్రాణం విసిగి కేసుపెట్టేశాడు. ఈ ఆపదను తప్పించే ఆపద్బాంధవుడిలా ఈ విషయంలో జోక్యం కలగజేసుకున్నారు స్థానిక మునసబుగారు. తలకో పదిరూపాయలిస్తే కేసు రద్దు చేయించగలనని మునసబుగారు రైతులకు వాగ్దా